


# అసలు విషయం ★

రచన:
కె. బి. కె. పట్నాయక్

"నాకీ సంబంధం ఎంతమాత్రం యిష్టం లేదు! మన శాంతకేం లోటు? ఊఁ అంటే సవాలక్షమంది వచ్చిపడ్తారు" అన్నది సరోజ. అక్కడున్నవాళ్లంతా తెల్లబోయారు!

"అదేవిటే అలా నంటావ్? పిల్లాడు అంత లక్షణంగా వుంటేను!" అన్నది తల్లి తాయారమ్మ.

"ఓ! లక్షణంట లక్షణంట లక్షణం! పెళ్లికొడుకన్నవాడికి కాస్త సిగ్గూ ఎగ్గూ ఉండక్కర్లా? ఆ మొహాన్ని చూడగానే అనుకున్నా ఎవడో రౌడీ అని!" సరోజ కోపం రెండింతలయింది.

"అఁ! అఁ!! ఏఁవి టేఁవిటి? అమాంతం అగ్గిఅయిపోతున్నారే రాణిగారు?" అప్పుడే పెళ్లివారిని దిగబెట్టి ఇంటికొచ్చిన శంకరం అందుకున్నాడు. శంకరం సరోజ భర్త!

"మరి ఆ అగ్గిమీద ఆజ్యంపోయకండి!"

"పోనీ నువ్వు చెప్పనక్కర్లేదులే!....నువ్వు చెప్పమ్మా మరదలుపిల్లా ఉరఫ్ పెళ్లికూతురా!" అంతవరకూ అక్కడే తలవంచుకూర్చొని అంతా వింటూన్న శాంత నడిగాడు శంకరం. శాంతకంతా అయోమయంగా వుంది!

అంతలో తాయారమ్మ—"చూడు నాయనా! అబ్బాయి అంత లక్షణంగావుంటే—మరి దీని కెక్కడ కనిపించాయో ఆ పోకిరీ లక్షణాలు? ఆ అబ్బాయి రౌడీలా వున్నాట్ట!"

"ఓ అలానా! నా పెళ్లాం అని గొప్పలు చెప్పుకోవటంకాదుగాని, మీ అమ్మాయిదివుందే గొప్ప నిశితదృష్టి! ఎదుటివారి తప్పుల్ని ఎంచటంలో అందెవేసినచెయ్యి!" అన్నాడు శంకరం నవ్వుతూ.

"నేనేం అంత 'బ్రూట్'ని కాను! 'మా పెద్దమ్మాయి' అని మా అమ్మ నన్ను చూపించి వాళ్లకు చెప్పినప్పుడు నన్నుచూసి నవ్వుతాడూ? పోకిరీలక్షణాలు కాకపోతే మరేఁవిటి? పెళ్లికొడుకు 'హొదా'లో వచ్చాడుకదా కాస్త సిగ్గుండక్కర్లా?" ముక్కుపుటా లెగరేస్తూ అన్నది.

"ఎందుకు నవ్వాడో ఏమిటో? ఎందుకలా నోరు పారేసుకుంటావ్?" అని తాయారమ్మ అన్నది.

"కాకపోతే మరేఁవిటి........"

సరోజ ఇంకా ఏదో అనబోతుండగా శంకరం అందుకొని, "నీ వాలకంచూసి నవ్వాడేమో!" అని నవ్వాడు.

"హుఁ!" అంటూ రోషంగా ఒక్కవిసురున లోనికి వెళ్లిపోయింది సరోజ.

"వాళ్లేమన్నారు నాయనా?" అంది తాయారమ్మ అల్లుణ్ణి ఉద్దేశించి.

"ఆలోచించుకొని కబురంపుతామన్నారు."

* * *

సరోజ, శాంత తాయారమ్మ కుమార్తెలు. తాయారమ్మభర్త చనిపోయి రెండేళ్లయింది. ఉద్యోగంలోవున్నరోజుల్లో బాగా గడించాడు. పదివేలరూపాయిల కిమ్మత్తుగల యిల్లు కట్టించాడు. ఆ యిల్లమీద నెలకు రెండొందలు అద్దెలు వస్తూంటయ్. సరోజకు తండ్రి చనిపోకముందే వివాహమైంది. సరోజభర్తశంకరం కలకత్తాలో పనిచేస్తున్నాడు. ప్రస్తుతం తాయారమ్మకు అల్లుడూ, కొడుకూ, మగదిక్కూ శంకరమే!

రెండో కూతురు శాంత యుక్తవయస్కురాలు కావడంతోనే సంబంధాలు వెదకటం ప్రారంభించింది తాయారమ్మ. ఆ వూళ్లోనే మంచి సంబంధం ఉన్నదని తెలుసుకుని ఓ మధ్యవర్తిద్వారా కబురంపింది. వాళ్లు అమ్మాయిని చూసి ఏమాటయినా చెబుతామన్నారు. ఆ వెంటనే సరోజనూ, శంకరాన్ని రమ్మనమని వర్తమానం పంపింది తాయారమ్మ. పెళ్లిచూపులదినానికి రెండురోజులు ముందుగానే సరోజ, శంకరం వచ్చారు.

తర్వాత పెళ్ళివారు రావడం, సరోజవైపు చూసి ఆనందరావు నవ్వడం, ఆమెకు కోపం రావటం అంతా మనకు తెలిసిన విషయమే!

* * *

అందరకూ అమ్మాయి నచ్చిందనీ, కట్నం కానుకలతో నిమిత్తం లేదనీ, ముహూర్తం నిర్ణయించి తెలియపర్చమని పెళ్లికుమారుడు ఆనందరావుతండ్రి పద్మనాభంగారి నుండి మర్నాడు కబురొచ్చింది.

ఈ శుభవర్తమానం అత్తగారికి అందజేసి శంకరం అన్నాడు—"అత్తయ్యా! ఈ సంబంధము మనందరకూ యిష్టపడ్డది. కాని శాంతను అడిగారు కాదేం?"

"అందరకూ అని అనకండి! నాకు నసేమిరా యిష్టంలేదు ఈ సంబంధం!" అన్నది సరోజమూతి మూడున్నర వంకరలుతిప్పుతూ.

"అబ్బే, లేదు రోజా! నేను చాలచోట్ల వాకబుచేశాను. చాల మంచికుర్రాడనే చెప్పారంతా."

"అయితే సరే! మీ యిష్టాలు."

"ఏఁవంటారు అత్తయ్యా! ఓసారి శాంతను కూడ కనుక్కోండి."

"మనకిష్టమయినది దానికిమాత్రం నచ్చకపోతుందా?" ఐనా అడిగేద్దాం ఏం పోయింది? అమ్మాయ్ శాంతా!" అని పిలిచింది.

"ఏమ్మా?" అంటూ వచ్చింది శాంత!

"మొన్న వచ్చిన సంబంధం మా అందరకూ నచ్చింది. వాళ్లదగ్గరనుంచి కూడ కబురొచ్చింది యిష్టపడ్డట్టు!....ఇక నీ ఉద్దేశం కూడ తెలియపరుస్తే పెళ్లియేర్పాట్లు అవీ చేస్తాం!" అన్నది.

శాంత కండ్లముందు ఆనందరావు రూపం సాక్షాత్కరించింది. అధరాలమధ్య మధురమైన మందహాసం, విశాలమైన ఫాలభాగం, లలాటంపై లాస్యమాడుతూన్న గిరులకురులు! చూపరులచే ఇట్టే ఆకర్షింపబడతాడు! తనకు నచ్చకపోవటం దేనికి? ఇలా ఆమె తలొంచుకొని ఆలోచిస్తుండగా శంకరం—"ఏం పిల్లా! ఏఁవిటాలోచిస్తున్నావ్? ఇప్పుడే మాతో మాటాడకుంటున్నావ్‌కదా! ఆ కాస్త మూడు ముళ్లూ పడితే ఏకంగా మమ్మల్ని మర్చేపోతావ్ గాబోలు!" అన్నాడు నవ్వుతూ!

"ఫో బావా, నువ్వు మరీను!" అని ఇంట్లోనికి వెళ్లిపోబోతూండగా, తాయారమ్మ ఆపి—"ఏమే వెళ్లిపోతున్నావ్? ఏదో ఓ సంగతి తేల్చెయ్!" అన్నది.

"మీ యిష్టం" అంటూ ఇంట్లోనికిపోయింది శాంత. అంతవరకూ అక్కణ్ణేవున్న సరోజ

మాత్రం తన పంతం నెరవేరలేదని విసురుగా వెళిపోయిం దక్కణ్ణుంచి. అత్తా, అల్లుడూ నవ్వుకున్నారు.

* * *

వివాహం నవ్యంగా జరిగిపోయింది. సరోజకు ఈ సంబంధం అయిష్టమయినా పెండ్లి పనులు తప్పనిసరిగా చేయాల్సివచ్చింది.

పెండ్లయిపోయాక వరుని యింటికి వెళ్లటంలో సరోజ రానని మొండికేసుక్కూచుంది. కాని వెళ్లకపోతే బావుండదని ఎంతో నచ్చచెప్పాక విధిలేక వెళ్లింది. కాని ముండ్లమీద ఉన్నట్లే వున్నది. ఆనందం ఎప్పుడామెవైపు చూచినా నవ్వుతూండేవాడు. దానితో ఆమెకు గంగవెర్రులెత్తిపోయింది. మూడోరోజున ఎంతమంది బ్రతిమాలినా వినిపించుకోకుండా వెళిపోయింది.

* * *

సంక్రాంతి పండుగ నెలరోజు లుందనగా శంకరానికి ఉత్తరం రాయించింది తాయారమ్మ కనీసం ఇరవై రోజులు ముందుగానైనా దంపతులిద్దర్నీ రమ్మనమని. ఊళ్ళోనే గనుక శాంతను పిలవటానికి స్వయంగా బయల్దేరి వెళ్లింది.

రిక్షా దిగీ దిగగానే "అత్తయ్య వచ్చారు - అత్తయ్య వచ్చారు" అంటూ ఆనందం చెల్లెళ్లిద్దరూ రిక్షావద్దకు పరుగెత్తారు. తాయారమ్మ వారిద్దర్నీ చెరోచేత్తోనూ కావలించుకొని ముద్దుపెట్టుకొంది.

భోజనాలయాక మాటాడుతూ తాయారమ్మ "అన్నయ్యా! వదినా! .... పండగ దగ్గరికి వస్తోంది. అమ్మాయిని, అల్లుణ్ణి పిలవటానికి వచ్చాను" అన్నది.

"దానికేమమ్మా! కాని....ఇంకా నెలరోజు లుందిగా పండక్కి! ఇప్పట్నుంచీ దేనికి?" అన్నాడు వియ్యంకుడు పద్మనాభంగారు తాంబూలం నములుతూ.

"ఇది మొదటి ఏడాదికదూ! అంచేత నెల గంటుబెట్టేనాటికి అమ్మాయి అక్కడుంటే సరదాగా వుంటుందని! లేదూ, మీకేమైనా యిబ్బందిగావుంటే మిమ్మల్ని కష్టపెట్టడం నాకిష్టలేదు"

"అబ్బే! అలా అనకండి వదినగారూ! మీ యిష్టంవచ్చినట్లే తీసుకెళ్లండి! మరో పది రోజులుపోతే ఎలానూ పంపిస్తాం! మీరంతగా ప్రాధేయపడుతుంటే కాదంటామా?" 'ఏమంటారు' అన్నట్టు భర్తవైపు సాభిప్రాయంగా చూసి అన్నది వియ్యపురాలు శారదమ్మ.

"సరే! అబ్బాయిమాత్రం వారంరోజులుందనగా వస్తాడు" అన్నాడు పద్మనాభం.

"అదేవిటి? మళ్ళీ అదో షరతుపెట్టారు! అల్లుడు లేనిదీ ఏం సరదాగా వుంటుంది చెప్పండి?" తాయారమ్మ నవ్వుతూ అన్నది.

"అబ్బాయి ఇప్పటినుంచీ దేనికమ్మా? వారంరోజులు ముందుగా ఎలానూ వస్తాడు. ఊళ్ళోనే గనుక మధ్యమధ్య వస్తాడులెండి!" అని శారదమ్మ అన్నది.

"అయితే అమ్మాయిని ఎప్పుడు తీసుకెళ్లమంటారు?"

"మంచిరోజు చూడాలిగా!" అని కళ్లజోడు పెట్టుకొని పంచాంగాన్ని పరిశీలించి 'రేపటి దినం బావుంది! రేపు తీసుకెళ్లమ్మా!' అన్నాడు పద్మనాభంగారు.

* * *

పండగ వారం రోజులుందనగా ఆనందం అత్తవారింటికెళ్లాడు. అక్రితందినమే సరోజ, శంకరం కలకత్తానుంచి వచ్చారు. ఆనందం వచ్చేసరికి శంకరం యీజీచెయిర్‌లో కూచొని ఏదో పత్రిక చదువుతూ, ఆనందాన్నిచూసి— 'ఏమోయ్! రారా!....రోజా! తమ్ముడొచ్చాడని శాంతతోను, అత్తయ్యతోను చెప్పవే!' అని లోనికి కేకవేసి 'అంతా కులాసా?' అని ప్రశ్నించాడు.

"ఆ! అంతా బాగానే వున్నారు! మీ రెప్పుడొచ్చారు?"

"నిన్ననే వచ్చాం!"

అంతలో తాయారమ్మవచ్చి—"ఏం బాబూ! అమ్మా, నాన్నా, చెల్లెమ్మలూ అంతా క్షేమంగా వున్నారా?....అమ్మాయ్ శాంతా! కాళ్లు కడుక్కోవటానికి నీళ్ళు తీసుకురామ్మా!" అని ఇంకా ఏవేవో సమాచారాలు అడగసాగింది. శాంత నీళ్ళుతెచ్చి అక్కడుంచి తుర్రుమంది!

"ఇంకా మా మరదలుపిల్లకు సిగ్గుపోనట్టుందే!....ఈ సిగ్గు నువ్వే ఎలానో పోగొట్టాలోయ్ తమ్ముడూ!" అన్నాడు శంకరం నవ్వుతూ. ఆనందం సన్నగా నవ్వుతూ తలుపువైపు చూశాడు. అక్కణ్ణుంచి గాజులు గలగలమంటూ మధురంగా సమాధానం పలికాయ్.

"లే నాయనా లే! కాళ్ళు కడుక్కో" అని తాయారమ్మ లోనికి వెళిపోయింది.

తనువచ్చి సుమారు ఓ గంటయినా సరోజ వచ్చి పలకరించకపోవటం వింతనిపించింది ఆనందానికి. అయినా ఏదో పనిగొడవలోవుండి వుంటుందని అనుకొని సమాధానపర్చుకున్నాడు. ఈ విషయాన్ని శాంత మినహా మరెవరూ గమనించలేదు. తన అక్కకు, భర్తమీదగల కోపానికి కారణం ఊహించలేకపోయింది! మొదటినుంచీ తనభర్తంటే ఎందుకలా అసహ్యించుకుంటుందో ఆమెకేమీ బోధపడలేదు. వెళ్లి పలకరించమని చెప్పటానికామెకు సిగ్గువేసింది.

వరండాలో కూచొని షడ్డకునితో మాటాడుతూన్న ఆనందానికికూడ కారణం బోధపడలేదు. చివరకు ఉండబట్టలేక శంకరంతో అడిగేశాడు — 'అన్నయ్యగారూ! వదినగారు ఎక్కడికైనా వెళ్లారా ఏం కనిపించటంలేదు?'

"ఇంట్లోనే వుందే!....అరె! నేను గమనించనే లేదు సుమా! మంచిమనిషే! ఇంటికొచ్చిన అల్లుణ్ణి పలకరించాలని తెలీదూ?" అని గబగబ వంటింట్లోనికివెళ్లి—"రోజా! ఆవతల ఆనందం వచ్చాడు. పలకరించి వెళిపోవటానికి తీరుబాటు లేనంత 'బిజీ'గా వున్నావా? పదపద!" అని ఆనందందగ్గరకు లాక్కొచ్చాడు. ఆమె ముఖం ముడుచుకొనే "ఏం బాబూ! అంతా బావున్నారా?" అని అడిగింది. "ఆc ఆc!" అని నవ్వుతూ జవాబిచ్చేడు ఆనందం. మరో ప్రశ్న అడక్కుండానే లోనికి వెళిపోయిందామె.

* * *

భోగిపండగ! ఇంకా తెల్లవారకుండానే ఊరంతా మేల్కొంది. మంటలు ఆకాశం ఎత్తున లేచాయి. పిల్లలకోలాహలం కోటిపడగలెత్తింది. ప్రతియిల్లు మామిడితోరణాలతోను, గుమ్మాలకు పసుపుకుంకుమలతోను, రకరకాల రంగవల్లులతోను కళకళలాడుతూ చుక్కల్లో చంద్రునిలా మెరుస్తున్నాయి.

తాయారమ్మగారింట్లో అంతా తలంటుపోసుకొని కాఫీటిఫిన్లు సేవిస్తూ బాతాఖానీ కొడుతున్నారు. మాటలసందర్భంలో ఆనందం— "అన్నయ్యగారూ! మొన్న పెండ్లికివచ్చినప్పుడు ఓ రెండురోజులుండి వెళిపోయారు. ఈసారి మీరూ, వదినగారూ తప్పకుండా వచ్చి కనీసం ఓ పది దినాలయినా మా యింట్లో వుండాలి! అమ్మకూడ చెప్పమన్నది అని అత్తగారితో!" అన్నాడు.

"అలాగేలే నాయనా! ఈ రోజుల్లో అంత ఆప్యాయంగా పిలిచేవారెవరు? అలానేవస్తారు" అన్నది తాయారమ్మ

"కాని నాకు శలవుదొరకదోయ్! పండగపోయిన వెంటనే డ్యూటీలో జాయినవాలి! మీ వదిన వచ్చివుంటుందిలే!" శంకరం అన్నాడు.

వెంటనే సరోజ "మరిప్పుడు నేనెందుకు లేద్దురూ? నేను కూడ మీతోనే వచ్చేస్తా!" అన్నది.

"అన్నయ్యగారిని విడిచిపెట్టడానికి మనస్కరించలేదు కాబోలు" చిలిపిగా నవ్వుతూ ఆనందం.

"అంత దీనిగా పిలుస్తుంటే వెళ్లనంటా వేమిటే?" అనునయంగా తాయారమ్మ అన్నది.

"నేను వెళ్లనంటే వెళ్లను అంతే!" అంటూ విసవిసా యింట్లోనికి వెళ్లిపోయింది. అక్కడున్న తాయారమ్మ, శాంత, శంకరం, ఆనందం ఆమె కోపానికి కారణం తెలుసుకోలేక విస్తుపోయారు. ఆనందం మొహం చిన్నబోయింది తాయారమ్మ కూతురువెనకాలే యింట్లోనికి వెళ్లింది.

"అమ్మాయ్! నీ పద్ధతి నాకేం నచ్చలేదు. పాపం అబ్బాయి ఎంత చిన్నబుచ్చుకున్నాడో చూడు! నీకంతగా వెళ్లటానికి యిష్టంలేకపోతే ఆ సంగతే శాంతంగా చెప్పకూడదూ?"

అంతలోగా శాంత, శంకరం అక్కడకు వచ్చారు.

"అమ్మా! నువ్వేన్నయినా అను! మర్యాదా తెలియని మనుష్యుల్తో శాంతంగా మాట్లాట్టం నా చాతకాదు" ఒళ్లు తెలియని ఆవేశంతో, ఇంచుమించు ఆయాసపడ్తూగా అన్నది.

"అక్కా!"

"అమ్మాయ్!"

శాంత, తాయారమ్మ, శంకరం ముగ్గురూ ఒకేసారి గట్టిగా అరిచారు.

సరోజ అన్నమాట ఆనందానికి వినిపించింది. అతని మనస్సు చివుక్కుమన్నది. మెల్లగా రంగంలో ప్రవేశించాడు. భార్య, అత్త తోడల్లుడూ నిర్జీవ ప్రతిమల్లా నిల్చునివున్నారు. ముగ్గురికండ్లలోనూ ఆవేదన తొంగిచూస్తోంది. సరోజ యేడుస్తూ కూర్చునివుంది.

ఆనందం మెల్లగా — "వదినగారూ! మీ హృదయాన్ని గాయపరచినంత మర్యాదా హీనంగా నేను ప్రవర్తించానని అనుకోను! అయినా తెలియక అలా ప్రవర్తించివుంటే క్షమించమని వేడుకుంటున్నాను" అంటూ వెళ్లిపోయాడు.

మరో పది నిమిషాలకు సూటుకేసుతో వచ్చాడు. ఆనందంచేతిలో సూటుకేసు చూసి అందరి గుండెలు గుభేలుమన్నాయి. అయినా ఎవరి నోటంటా మాటరాలే!

గదితలుపుదగ్గరే నిల్చొని ఆనందం "నేను వెళ్లిపోబోయేముందు ఓచిన్నవిషయంఅడుగుతున్నాను. నావల్ల జరిగిన అపరాధమేమిటో కాస్త తెలియపర్చితే ఇకముందు అటువంటి పొరపాటుపనులు చేయకుండా వుండేందుకు ప్రయత్నిస్తాను." కాసేపాగి అటునుంచి ఎటువంటి సమాధానం రాకపోవటంతో, "సరే! మించిపోయిందేమీలేదు! ఎప్పుడయినా సరే నా తప్పును తెలియపరుస్తే! దాన్ని సవరించుకోవటానికి సిద్ధంగావున్నాను .... అత్తగారూ! పండగపోయినవెంటనే మాఅమ్మను పంపిస్తా! శాంతను పంపించేయండి! .... వస్తా!....వస్తానండీ అన్నయ్యగారూ!" అని బయల్దేరాడు. అక్కడున్నవారిలో ఎవరినోటంటా పలుకు పెగల్లేదు. రెండడుగులు వేసేటంతలో "ఆగండి" అని శాంత అన్నది. "ఒక్క పది నిమిషాలు ఆగండి! నేను కూడ మీతోనే వస్తున్నా."



"అదేవిటి శాంతా! నువ్వుకూడ నాతో వచ్చేస్తే యేం బావుంటుంది ? పండగపోగానే పచ్చేద్దువులే" అన్నాడు ఆనందం.

"నే నీ యింట్లో ఒక్కక్షణం ఉండేదిలేదు. నాయింటికి నేను వెళ్లిపోవస్తాను" అంటూ పెట్టె సర్దుకోవటం ప్రారంభించింది.

తాయారమ్మ బిక్కపోయి గుడ్లనీరు కక్కుకోసాగింది. శంకరం అప్పుడే తెలివొచ్చినవానిలా అన్నాడు—"రోజా! ఏవిటి ఇదంతా మహామాయలావుందే? నీకు పిచ్చిగాని పట్టలేదుకదా? .... అత్తగారూ! మీరుకూడ అలా చూస్తారేం వాళ్లను ఆపకుండా?....శాంతా!.... తమ్ముడూ!! మీరు వెళ్లటానికి వీలులేదు.... ఇదిగో రోజా! అసలు జరిగిన సంగతేవిటో ఇప్పుడు చెబితేనేగాని నే నొప్పుకునేదిలేదు." శంకరం ఉగ్రస్వరూపంచూసి అంతా ఏమవుతుందోనని గజగజలాడసాగారు.

శంకరం గబగబవెళ్లి ఆనందంచేతిలో సూటుకేసును లాక్కొని గదిలో ఉంచుతూ— "అత్తయ్యా! అసలు సంగతేవిటో దాన్ని కనుక్కోండి. నేను తమ్ముడ్ని వెళ్లిపోకుండా బ్రతిమలాడ్తాను" అని అవతలవరండాలోనికి ఆనందాన్ని తీసుకెళ్ళి "చూడు తమ్ముడూ! అది వట్టి బ్రభ్రాజమానం! ప్రతీదానికీ అకారణమైన ఆవేశం! ఆ ఆవేశంలో ఎవరైనా బాధపడతారనే ఆలోచనయినా లేకుండా ఏదో అనేస్తుంది! దానిమాటల్ని పట్టుకొని నువ్విలా యిప్పుడు వెళ్లిపోతే లోకులంతా ఏమను కుంటారు ? దాని తెలివితక్కువతనానికి నేను క్షమాపణవేడుకుంటున్నాను" అన్నాడు ఎంతో నయంగా.

"మీరు పెద్దవారు! మీ రిలా అనకూడదు. నాలో ఏదో దోషం ఉందిగాబట్టే ఆమె అలా అన్నారు. ఆ జరిగినసంగతేదో చెప్పేస్తే ఇంత బాధ కలుగకపోను."

అంతలో ఇంట్లోంచి తాయారమ్మ స్వరం వినిపించింది. "ఓసి వెర్రిమొహమా! దీనికేనా ఇంత రాద్ధాంతంచేశావ్? ఎవరైనా వింటే నవ్విపోరూ? ఆ మాత్రం బుద్ధి ఉపయోగించకపోతే ఎలా?"

ఆ వెంటనే శాంతస్వరం వినిపించింది—
"అక్కా! నేనంతా విన్నా! నువ్వనుకున్నంత మర్యాదాహీనులూ, పోకిరీకారు ఆయన!.... నీవైపుచూసి ఆయన ప్రతిసారీ నవ్వుతారంటే ఏదో ఒక కారణం వుండివుంటూంది! ఎప్పుడయినా హాస్యానికయినా యీవిషయం ఆయన్ను అడగొచ్చుగా? దీన్నిగురించి ఇంత గొడవచేశావ్!"

ఈ మాటలు వినగానే ఆనందం మొహం వివర్ణమయింది. వెంటనే చిరునవ్వుమొహాన్ని చిగురించింది. దీర్ఘంగా ఒక్క నిట్టూర్పు విడిచి నవ్వుతూ అన్నాడు — "అన్నగారూ! అంతా అర్థమైంది. ఇందు వదినగారి తప్పేమీ లేదు! తప్పంతా నాది! ప్రాయశ్చిత్తంగా నా ప్రయాణం విరమించుకుంటున్నాను."

శంకరం సంతోషంతో పిచ్చివానిలా ఇంటిలోనికి ఒక్క గంతువేశాడు! "అత్తయ్యా! తమ్ముడి కోపం పోయింది! వెళ్లండి వంట ప్రయత్నాలు ఆవీ చేయండి!" అని ప్రయాణానికి సిద్ధంగావున్న శాంతను చూసి—"మై డియర్ మరదలుపిల్లా! ప్రయాణానికి సిద్ధంగా వున్నావా? నువ్వు 'మీ యింటికి' భేషుగ్గా వెళ్ళొచ్చు. మా తమ్ముడు ఉరఫ్ 'ఆయన' మాత్రం పండగపోయాక వస్తాడు" అన్నాడు నవ్వుతూ.

శాంత ఆనందాశ్చర్యాలతో వంటింట్లోకి పరుగెత్తింది.

* * *

ఉదయం ఆకస్మికంగా జరిగిన సంఘటన నుంచీ తల్లీ కుమార్తెల మనసులు స్థిమితం తప్పిపోయాయ్! వారి కా సంఘటన ఎంత మర్చిపోదామనుకున్నా వీలుకాలేదు. యాంత్రికంగా ఎవరిపనులు వారు చేసుకుపోతున్నారంతే!

రాత్రిపనులన్నీ ముగించుకొని తాయాతమ్మ వరండాలోని కొచ్చేసరికి అల్లుళ్ళిద్దరూ నవ్వుకుంటూ ఏదో చర్చించుకునటున్నారు.

తాయాతమ్మ అక్కడవున్న చాపమీద కూర్చుంటూ "నాయనా! ఇవాళ లేచినవేళ ఎటువంటిదో కాని అనవసరంగా నిన్ను...." ఇంకా ఏదో అనబోయేసరికి శంకరం మధ్యలోనే ఆపి అన్నాడు.

"అదేవిటత్తయ్యా అలాగంటారు? ఇవాళ లేచినవేళ ఫస్టు క్లాసయినది! అందువల్లనే మీరు మాంచి తనవత్తరమైన కథ వినబోతున్నారు" అన్నాడు.

సరోజ, శాంత మెల్లగావచ్చి తల్లిప్రక్కనే కూర్చున్నారు బిడియపడుతూ!

ఆనందం ప్రారంభించాడు.

"అమ్మా! అమ్మా! నాకు కాల్‌మిమో వచ్చిందమ్మా!" అన్నాడు ఓ అబ్బాయి వాని తల్లితో!

"ఏఁవిటి నాయనా అది?" ప్రశ్నించిందా మాతృశ్రీ.

"ఉద్యోగంగురించి పరీక్ష యివ్వటానికని రమ్మనమని వచ్చిన ఉత్తరం అది."

"మంచిది నాయనా! మీతండ్రి రిటైరయే సమయానికి నీచేయి కలిసొస్తే అదే పదివేలు! అంతా ఆదేవునిదయ! నాన్నగారితోచెప్పావా?"

"నాన్నగారి ఎడ్రసుకే వచ్చిందమ్మా!"

నీకు ఉద్యోగం అయి ఓ యింటివాడు అయితే...." అర్ధస్వగతంగా దేవునితో చేతులు జోడిస్తూ అన్నదామె.

"ఇదేదో అవనీయమ్మా! తర్వాత అవన్నీ చూద్దాం!" అని అక్కణ్ణుంచి వెళిపోయాడా అబ్బాయి.

కలకత్తాలో పరీక్ష తృప్తికరంగానే వ్రాసి జనతాలో బయలుదేరాడు.

హౌరాలో బయల్దేరిన జనతాలో రష్ సామాన్యంగా వున్నది. ఆ అబ్బాయికి కూచోటానికి చోటుదొరికింది. బండి బయల్దేరింది. ఏదో ఆలోచిస్తున్న అబ్బాయి కి మాటలు వినిపించాయి.

"ఏఁవండీ! ఇవాళ ట్రెయిన్ అంత 'రెస్టు' గా లేదేమో?" అన్నదో స్త్రీ కంఠం.

దానికి సమాధానంగా "ఖర్గపూర్‌వరకు ఇలానే వుంటుందిలే! అక్కణ్ణుంచి చూడాలి రష్!" అని పలికింది పురుషకంఠం.

తనకెదురుగావున్న బెంచీమీద కాస్త దూరముగావున్నవారిని చూశాడు. వా రిరువురూ భార్యాభర్తల్లా అవుపించారు. ఇద్దరూ మాంచి 'టిప్‌టాప్'గా ఆఫీసరు దంపతుల్లా వున్నారు. కాని 'రష్'ని కాస్తా 'రెస్టు'గా మార్చేసిన ఆ లలనామణినిచూసి సన్నగా నవ్వుకున్నాడా అబ్బాయి.

ఖర్గపూర్‌కి ఇంకో రెండు మైళ్ళుందనగా నిద్రపోతున్న భార్యాని ఆ భర్త లేపుతూ, "రోజా! స్టేషనుదగ్గరకొస్తుంది! గెటప్ గెటప్!" అన్నాడు.

భార్యతో ఇంగ్లీషు మాట్లాడుతున్నాడే యీయన! 'ఆవిడ' కూడా తప్పకుండా ఇంగ్లీషువచ్చేవుంటుంది. ఇందాక ఏదో పొరపాటున అలా అనేసివుంటుంది అనుకున్నాడు.

'రోజా' అనబడే ఆవిడలేచి బద్ధకంగా అవులించి మొహం చిదరించుకుంటూ "ఏఁవండీ ఏఁవిటి ఇంత స్మెల్‌గా వాననేస్తున్నది?" అని ప్రశ్నించింది.

'స్మెల్‌గా వాసనేస్తున్న'దంటున్న దేవిటో అని నివ్వెరపోయాడా అబ్బాయి.

అంతలో ఆమెభర్త అలా చూడమంటూ చేయి చూపించాడు అబ్బాయికూడ చూశాడు. ఓ చిన్నకుర్రాడు మలవిసర్జనచేశాడు. అప్పుడా అబ్బాయికి 'స్మెల్‌గా వాసన' అన్నపదానికి అర్థం అవగతమైంది. ఉండబట్టలేక ఫకాలున నవ్వాడు. భార్యా భర్త లిరువురూ ఆ అబ్బాయివైపు చూసేసరికి మరోవైపు మొహం తిప్పేశాడు.

ఖర్గపూర్‌లో జనతా ఆగింది.

'రోజా' అనబడే ఆవిడచుట్టూ ఓసారి పరికించి "ఏఁవండీ మనల్ని 'రిలీవ్'చేసుకోవటానికి ఎవరూ రానట్టుందే?" అన్నది.

"ఇంతరాత్రివేళ మనల్ని 'రిసీవ్'చేసుకోవటానికి రాలేదనటం అర్థంలేనిమాట! అందులోనూ యిద్దరూ ఆడవాళ్లాయె! ఎలా వస్తారు చెప్పు?" అన్నాడు ఆ రోజాభర్త!

ఈ మాటల్నివిని ఆ 'అబ్బాయి'కి అసలు విషయం తేటతెల్లమయింది! 'ఫాషన్'పేరుతో మాతృభాషను మట్టిలో కలిపి పరభాషను తనదిగా చేసుకోవటానికి ప్రయత్నిస్తూ విఫలురాలౌతున్న ఆ ఆధునిక యువతిలలామనుచూసి ఈసారి ఇంకా గట్టిగా నవ్వాలనిపించింది!

ఆరు మాసాలతర్వాత ఆ ఖర్గపూర్‌లోనే 'పోస్టింగ్' అయినట్లు ఆర్డర్లు వచ్చాయి. ఆ మరుచటి యేడాదే వివాహం కూడ జరిగింది ఆ 'అబ్బాయి'కి!

* * *

ఆగాడు ఆనందం!

శంకరం చప్పట్లుచరుస్తూ గట్టిగా నవ్వి అన్నాడు—"భేష్ తమ్ముడూ! బలే బావుంది కథ! 'రెస్టు-రష్' 'స్మెల్‌గా వాసన' 'రిలీవ్-రిసీవ్!' భలే! అమిగిలింది నేను పూర్తిచేస్తాను.

"పెండ్లిచూపులకని వచ్చిన ఆ అబ్బాయి ఉరఫ్ ఈ ఆనందం, ట్రెయిన్‌లోకలిసిన ఆ 'రోజా' అనబడే ఈవిడనూ, 'ఆవిడ' భర్తయైన శంకరాన్ని అనగా మనలనూ చూడటం తటస్థించింది. ఆ తర్వాత వారు తనకు వదినగారు, తోడల్లుడు అవుతారని తెలుసుకున్నాడు. ఆ 'రోజా'ను చూచేసరికి ఆనాటి సంఘటన గుర్తుకొచ్చినవ్వాడు. ఆమెను ఎప్పుడుచూసినా నవ్వవస్తుండేది! అది 'ఆమె'గారికి కోపం! చివరకు ఆమె కోపానికి పరిణామం ఏమిటి? ఆమె కోపం తీరినదా? మొదలగు విషయాలు నేడు వెండితెరపైచూచి మీరు ఆనందించిరి! ఏం తమ్ముడూ! అంతేనా?"

"నన్నా అడుగుతున్నారు? ఆవిడను అడగండి! ఏఁవండీ దినగారూ! ఇప్పటికైనా మీ కోపం తీరిందా?"

అంతా తేలికపడ్డ హృదయాల్తో నవ్వుకున్నారు. అంతవరకూ ఆకాశాన్ని ఆవరించివున్న మబ్బులు పూర్తిగా తొలగిపోయాయ్! ఆనందం ఆ యింట్లో తాండవమాడింది. ★